'ఓపెన్' పది, ఇంటర్ అడ్మిషన్లకు 30 వరకు గడువు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 24: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 30 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో వాసంతి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అనగోని సదానందం తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు సమీపంలోని ఉన్నత పాఠశాల, కాలేజీల్లో సంప్రదించాలన్నారు. మండలాల్లోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, అడ్మిషన్ ఫారం పొంది ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నమోదు చేయాలన్నారు. విద్యార్థులు స్వయంగా అడ్మిషన్ ఫీజును www.telangaanaopenschool.org వెబ్‌సైట్ ద్వారా చెల్లించి, ఈనెల 31న సమర్పించాలన్నారు. వివరాలకు 93460 20003, 9396337572 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Gundelly Pravalika, D/o: Gundelly Chandramouli, W/o: Kashaveni Madhu, Age: 27 years, Occ: House hold, R/o: H.No. 3-17, Rathnagiri village Bheemadevarapally mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages, Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

All that the house with open place admeasuring to an house number 2-30 (Assessment No. 181), admeasuring to an extent of 253.33 Square yards OR 211.78 Square meters, RCC house plinth area 600.00 Square feets & Tin sheet plinth area 282.00 Square feets, within the boundaries
North: House of Gundeti Mohan
South: GP Road
East: Own Road
West: GP Road
is situated at Rathnagiri village Bheemadevarapally mandal of Hanamakonda dist
Date: 24-12-2024
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ శాఖ
 # 249/3RT, 1వ అంతస్తు, S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500 038.

అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6(2)/8(6)}

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీ క్రెడిటార్ ఇందులో నిర్దిష్టపరచిన సమయంలోగా బకాయిలు చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీ చేశారు. నిర్దిష్ట కాల వ్యవధిలోగా సదరు నోటీసును పాటించుటలో మీరు విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బ్యాంక్‌కు మీరు బకాయి మొత్తం చెల్లించలేదు. అందువల్ల ఆన్‌లైన్ విధానం ద్వారా ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజుల తర్వాత బహిరంగ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ తెలిపిన ఆస్తి విక్రయించుట తప్పనిసరి అయినది. ఆస్తి రిజర్వు ధరతో సహా ఇ-వేలం తేదీ మరియు సమయం మరియు ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

అందువల్ల, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీలోగా బ్యాంక్ ద్వారా భరించబడిన తదనంతర వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా బ్యాంక్‌కు బకాయి మొత్తం మీరు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకం కొరకు ఏ విధమైన తదుపరి చర్య తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13 (8)లో తెలిపిన క్లాసిఫికేషన్: ఇంటర్నల్ ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకోవచ్చును.

1 **రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1. M/s తార క్లాసిక్ రెస్టారెంట్ & బార్ ప్రొప్రయిటర్: బిల్లా రమణారెడ్డి,** ఇ.నెం. 1-1-263, 100 అడుగుల రోడ్, ప్రశాంత్ నగర్, కాజీపేట, వరంగల్-506 004. **1) శ్రీ బిల్లా రమణారెడ్డి, తండ్రి: మధుసూదన్‌రెడ్డి,** ఇ.నెం. 1-7-1329, రోడ్ నెం. 5, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం, హనుమకొండ-506 001. **హామీదారు: 2) శ్రీ బిల్లా మధుసూదన్‌రెడ్డి, తండ్రి: బిల్లా రాజిరెడ్డి,** ఇ.నెం. 1-7-1329, రోడ్ నెం. 5, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం, హనుమకొండ-506 001.
డిమాండ్ నోటీస్ తేది: 02-04-2019 **స్వాధీనత ప్రకటన తేది: 03-06-2019**
మొత్తం బకాయి: 30-11-2024 నాటికి **రూ. 1,85,35,810.14** తదుపరి వడ్డీ, వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా.
స్థిరాస్తి వివరణ
ఆస్తి వివరాలు: వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం, దామెర గ్రామం ఎల్లక్కిల్ సబ్-స్టేషన్‌కు ఎదురుగా, మెయిన్ రోడ్ వద్దగల సర్వే నెం. 329, 330, 331 & 332 లలో విస్తీర్ణం 6426.93 చ.గజాల నివాసపు ఓపెన్ ప్లాట్స్ నెం.లు 1, 2, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 30 & 31 (18 ప్లాట్లు) యొక్క EMD. **సరిహద్దులు:** తూర్పు: 80' R&B రోడ్, పడమర: గౌరు విజయలక్ష్మి యొక్క వ్యవసాయ భూమి, సర్వే నెం. 335/ఇ లో భర్త: శిశుపాల్‌రెడ్డి, ఉత్తరం: దామెర రూబెన్ యొక్క వ్యవసాయ భూమి, తండ్రి: ఆనందం & సర్వే నెం. 335/ఎ లో దామెర ప్రవెన్, తండ్రి: ఆనంద, దక్షిణం: సర్వే నెం. 328/D2 లో డోనర్ (బిల్లా మధుసూదన్‌రెడ్డి) యొక్క వ్యవసాయ భూమి & ఇతరులు.
తేది: 18-12-2024

2 **రుణగ్రహీత(లు) యొక్క పేరు మరియు చిరునామా: మెస్సర్స్ త్రిష కన్‌స్ట్రక్షన్స్, యజమాని: శ్రీ బిల్లా రవీందర్‌రెడ్డి,** ఇ.నెం. 2-5-380, ఎస్.వి. కాలనీ, జిల్లా కోర్టు వెనుక, నక్కలగుట్ట, హనుమకొండ-506 001. **సహ-దరఖాస్తుదారు/హామీదారు: శ్రీమతి బిల్లా గౌతమి, భర్త: శ్రీ బిల్లా రవీందర్‌రెడ్డి,** ఇ.నెం. 2-5-380, ఎస్.వి. కాలనీ, జిల్లా కోర్టు వెనుక, నక్కలగుట్ట, హనుమకొండ-506 001.
డిమాండ్ నోటీస్ తేది: 16-05-2024 **స్వాధీనత ప్రకటన తేది: 09-11-2024**
మొత్తం బకాయి: 30-11-2024 నాటికి **రూ. 1,05,08,692.42** తదుపరి వడ్డీ, వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా.
ఆస్తి షెడ్యూలు
శ్రీమతి బిల్లా గౌతమికి చెందిన వరంగల్, హనుమకొండ, ఎస్.వి. కాలనీ, అదాలత్ వెనుక, నక్కలగుట్ట వద్దగల 300 చ.గజాల విస్తీర్ణంలో నివాస భవనం ఇ.నెం. 2-5-380 యొక్క EMD (**గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం. 9324/2013, తేది: 26-10-2013**). **సరిహద్దులు:** ఉత్తరం: ప్లాట్ నెం. (12)లో సత్యనారాయణ యొక్క ఇ.నెం. 2-5-379, దక్షిణం: ప్లాట్ నెం. (14)లో సి.హెచ్. నీరజ యొక్క ఇ.నెం. 2-5-381, తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్, పడమర: ప్లాట్ నెం. 2.
తేది: 17-12-2024

ప్రదేశం: హైదరాబాద్. చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

రైతు కూలీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతి పేద వ్యవసాయ కూలీకీ భరోసా ఇవ్వాలి
- ఆంక్షలు లేకుండా పథకాలు అందించాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబర్ 24: రైతు కూలీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంతో సంబంధం లేకుండా ప్రతి పేద వ్యవసాయ కూలీకి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 100 రోజుల ఉపాధిహామీ పనులు పూర్తి చేసిన వ్యవసాయ కూలీలకే ఆర్థిక భరోసా కింద రూ. 12 వేలు ఇస్తామనడం మోసమని విమర్శించారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ. 12 వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచి, ప్రస్తుతం ఉపాధిహామీ పథకానికి లింక్ పెట్టడం సరికాదన్నారు. ఏడాదిలో 100 రోజులు పూర్తి చేసిన ఉపాధి కూలీలు ఒక ట్రొండు శాతం మాత్రమే ఉంటారని తెలిపారు. మిగతా కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపిందని ధ్వజమెత్తారు. ఇది ఒకట్రొండు ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు జాబ్‌కార్డు ఉన్నా అనర్హులను చేసే కుట్రలో భాగమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన విధంగా వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానం చేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి కూలీకి ఏటా రూ. 12 వేలు చెల్లించాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని వెంటనే అనుసంధానం చేయాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యవసాయ కూలీకి ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. అన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలయ్యే వరకూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

కార్పెట్లకు స్టాంపు వేస్తున్న సిబ్బంది

నేత సంఘాల్లో కార్పెట్ల కొనుగోలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 24: జిల్లాలోని పలు చేనేత సంఘాల నుంచి కార్పెట్ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. టెస్కో ద్వారా కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలి విడతలో సుమారు పది వేల పీసులను కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. టెస్కో అధికారులు స్వయంగా వచ్చి ఆయా సంఘాల్లో నిల్వ ఉన్న కార్పెట్లను కొనుగోలు చేస్తుండడంతో నేత సిబ్బంది స్టాంపింగ్ చేసి, బండిల్స్ తయారు చేస్తున్నారు. అలాగే, వచ్చే సంవత్సరంలో కూడా కార్పెట్లు, బెడ్‌షీట్ల కొనుగోలు కోసం రూ. 3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు టెస్కో అధికారులు పీపీ ఇచ్చినట్లు నేత సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. సంఘాల్లో స్టాక్ లేకుండా ఉత్పత్తి చేసిన వాటిని వెంటవెంట కొనుగోలు చేస్తే, కార్మికులకు ఉపాధితోపాటు సంఘాలు అభివృద్ధి చెందుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

షాపును ప్రారంభించిన జేడీ లక్ష్మీనారాయణ

'జేడీ' సహకారంతో కిరాణా షాపు ఏర్పాటు

పర్వతగిరి, డిసెంబర్ 24: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఆర్థిక సహకారంతో మండలంలోని ఏనుగల్లులో మాసాని స్రవంతి కిరాణా షాపు ఏర్పాటు చేసుకుంది. మంగళవారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వయం కృషితో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. కృషి, పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు.

ముస్తాబైన మహేశ్వరం బాల యేసు దేవాలయం

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

నర్సంపేట, డిసెంబర్ 24: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నర్సంపేట పట్టణంతోపాటు మండలంలోని అన్ని చర్చిలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్లు ప్రార్థనలు నిర్వహించనున్నందున చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎన్నో ప్రత్యేకతలు ఉన్న మహేశ్వరంలోని బాల యేసు దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పాన్ షాపులో చోరీ

వర్ధన్నపేట, డిసెంబర్ 24: మండలకేంద్రం సమీపంలోని బార్ వద్ద ఉన్న పాన్ షాపులో చోరీ జరిగింది. మండలకేంద్రానికి చెందిన కుక్కల రమేశ్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరిగి షాపు తీసేందుకు రాగా వేసిన తాళం తీసి ఉంది. షాపులో రూ. 10 వేల వస్తు సామగ్రి అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్

ఖిలావరంగల్, డిసెంబర్ 24: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపారు. దుగ్గొండికి చెందిన మంద పవన్‌కుమార్, హనుమకొండ భీమారానికి చెందిన సుంచు రాహుల్ ఉర్సుగుట్ట సమీపంలో గంజాయి అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సోదాలు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 17,500 విలువైన 700 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

డీలర్లు రైతులకు అండగా ఉండాలి

ఖిలావరంగల్, డిసెంబర్ 24: డీలర్లు రైతులకు అండగా ఉంటూ నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందించాలని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. శివనగర్‌లోని ది వరంగల్ ఫెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ భవనంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. రైతులు ఎక్కువగా డీలర్లనే నమ్ముతారని, వారికి మేలు చేయాలని సూచించారు. నిబంధనలకు లోబడి మాత్రమే విత్తనాలు, ఫెస్టిసైడ్స్ విక్రయించాలన్నారు.

'రైతులను మోసం చేస్తున్న దళారులు'

చెన్నారావుపేట, డిసెంబర్ 24: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారులు ఇష్టారీతిన రైతులను మోసం చేస్తున్నారని మాజీ ఎంపీపీ విజేందర్ ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీటీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు ఆరు కిలోల చొప్పున కోత విధిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సహకరించక, తెగులు కారణంగా దిగుబడి తగ్గి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని, ఈ క్రమంలో కోత పేరుతో మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మహిళలకు చీరెల పంపిణీ

నర్సంపేట, డిసెంబర్ 24: పట్టణంలోని 14వ వార్డు రామాలయం వీధిలో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం బిర్రు దేవేందర్ జ్ఞాపకార్థం అతడి కుటుంబ సభ్యులు మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి పాస్టర్ పాల్, కౌన్సిలర్ విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతిరెడ్డి, భారతి మహిళా మండలి అధ్యక్షురాలు కరుణ, పాకాల మహిళా బ్యాంక్ అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, కస్తూర్బా మహిళా మండలి అధ్యక్షురాలు గుర్రపు అరుణ, బిర్రు సుధ, విజయ్, సునీల్, అంచూరి అరుణగుప్తా, రాజేశ్వరి, అను, చైత్ర మేఘు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయలకు లెక్కలు చూపాలి

- మడికొండలోనే 50 ఎకరాల స్థలం కేటాయించాలి
- పాత కమిటీని రద్దు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సభ్యులు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 24: హనుమకొండ జిల్లా మడికొండలోని మహాత్మాగాంధీ మహిళా గార్మెంట్ పరస్పర సహకార పొదుపు అభివృద్ధి మార్కెటింగ్ సంఘం లిమిటెడ్‌లోని పాత కమిటీ సభ్యులు కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేశారని, వాటాధనం లెక్కలు చూపాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్త వాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయకుండా పాత కమిటీ సభ్యులు నిర్లక్ష్యం చేశారని, దీని కితోడు ప్రభుత్వం కూడా గార్మెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై మహిళా సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో మడికొండలో గార్మెంట్ పరిశ్రమ కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించినప్పుడు ఒక్కో సభ్యురాలు రూ. 1.60 లక్షల వాటాధనం చెల్లించిందని, దీంతో రూ. 3.39 కోట్లను ప్రభుత్వానికి డిపాజిట్ చేసినట్లు వివరించారు. మిగిలిన డబ్బులు చెల్లించడంలో పాత పాలక వర్గం అశ్రద్ధ చేయడంతో సంబంధిత అధికారులు గార్మెంట్ పరిశ్రమ రద్దు చేశామని చెబుతున్నారని తెలిపారు. కోట్లాది రూపాయల డబ్బు చెల్లించి, ఇప్పుడు లేదంటే తమ పరిస్థితి ఏమిటని మహిళలు ప్రశ్నించారు. పాత కమిటీ చేసిన నిధుల దుర్వినియోగానికి తాము బాధ్యులం కాదని స్పష్టం చేశారు. 50 ఎకరాల స్థలాన్ని తమకే కేటాయించాలని, గార్మెంట్ పరిశ్రమను మడికొండలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చచేశారు. జనగామ జిల్లా కళ్లెంలో స్థలం పరిశీలనను మానుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. నూతన కమిటీలో ముండ్రాతి అరుణ, ఆడెపు రజిత, తేలు గీత, ఆడెపు భాగ్యలక్ష్మి, వడ్డెపల్లి రమాదేవి ఉన్నారు. సమావేశంలో నేత సంఘం నాయకులు పంతగాని శ్రీనివాస్, కొలిపాక మదనయ్య, చిప్ప వెంకటేశ్వర్లు, పిట్ట రాములు, మండ్రాతి మధుసూదన్, ఆడెపు రవి తదితరులు మాట్లాడారు.

రౌటీషీటర్లతో కఠినంగా వ్యవహరించాలి

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సామగ్రిని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

ఖిలావరంగల్, డిసెంబర్ 24: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌటీషీటర్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, నిందితుల వివరాలు, రౌడీషీటర్ల ట్రిపుల్ సీ ఫిర్యాదులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తులపై వివరాలను సీఐ జే వెంకటరత్నంను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం పీఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఎస్సైలు సురేశ, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఇంటికి వెళ్లిన సీపీ

కరీమాబాద్: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఓ రౌడీషీటర్ ఇంటికి మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెళ్లారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సందర్శించిన అనంతరం స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్ ఇంటికి సీపీ వెళ్లి అతడితో మాట్లాడారు. ఈ సందర్భంగా మిల్స్‌కాలనీ సీఐ ఫొటోను చూపించి ఈయన ఎవరో తెలుసా అని అడిగినట్లు సమాచారం. స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినప్పుడు హాజరవుతున్నావా అని ప్రశ్నించినట్లు తెలిసింది. అందుకు రౌడీషీటర్ సమాధానం చెప్పినట్లు వినికిడి. సత్ప్రవర్తనతో మెలగాలని సీపీ రౌడీషీటర్లకు సూచించారు.

'వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం'

సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

గిర్మాజీపేట/కాశీబుగ్గ, డిసెంబర్ 24: ప్రతి వినియోగదారుడు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వరల్డ్ వైడ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థ జిల్లా చైర్మన్ బోనగిరి రాజన్న అన్నారు. నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా మంగళవారం పిన్నవారివీధిలోని వరంగల్ వాసవీ క్లబ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం వినియోగదారుల హక్కులపై శారద హైస్కూల్ విద్యార్థులకు రాజన్న అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా చైర్మన్ గుండా సంతోష్, రాష్ట్ర వైస్ చైర్మన్ ఎస్ లక్ష్మీనారాయణ, డివిజనల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పాండురంగవిట్టల్, గాదె వాసుదేవ్, కరస్పాండెంట్ సురేశ్ పాల్గొన్నారు. అలాగే, కాశీబుగ్గలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు రావుల రంజిత్‌కుమార్ పోస్టర్ విడుదల చేశారు. సభ్యులు కల్యాణపు శ్యామ్‌సుందర్, వెంపటి శ్రీధర్, బి.చారి, చరణ్, అశోక్ పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

డ్రైనేజీని పరిశీలిస్తున్న గ్రేటర్ కమిషనర్

వరంగల్, డిసెంబర్ 24: వరద ముంపు నివారణ కోసం జూపార్క్‌లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కుడా, బల్దియా అధికారులతో కలిసి మంగళవారం ఆమె జంతు ప్రదర్శనశాల, భద్రకాళీ బండ్ ప్రాంతాల్లో పర్యటించారు. అడ్వకేట్ కాలనీ, నందిహిల్స్ కాలనీ నుంచి వచ్చే వరద నీరు ప్రభావాన్ని నివారించడానికి బాక్స్ డ్రైనేజీ నిర్మించాలన్నారు. భద్రకాళీ చెరువులో నీటి తొలగింపు పూర్తయిన క్రమంలో పూడికతీత పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులో మిగిలిపోయిన గుర్రపు డెక్క అవశేషాల నుంచి ఫైబర్ సేకరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించి ఉపాధి పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కుడా ఈఈ భీమ్‌రావు, బల్దియా ఈఈలు సంతోష్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రజిత, ఏర్షాద్, ఏఈ మేనక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిత్, స్మార్ట్‌సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ అనుమతులు రద్దు చేయాలి

అజంజాహి మిల్లు కార్మిక భవనం స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ అనుమతులు రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు, మిల్లు కార్మిక కుటుంబాలు కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అలాగే, అనుమతుల కోసం సమర్పించిన వివరాలను అందజేయాలని, 75 ఏళ్ల చరిత్ర కలిగిన అజంజాహి మిల్లు కార్మిక భవన్‌ను ఆక్రమంగా కూల్చివేసి, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌కు కలిసిన వారిలో 19వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు భూషిపాక రవీందర్, మిల్లు పూర్వ కార్మికురాలు తిప్పారపు రాధమ్మ ఉన్నారు.

వరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 24: ఇటీవల టీఎస్‌పీఎస్‌సీ ద్వారా ఎంపికైన ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం విధుల్లో చేరారు. దేశాయిపేటకు చెందిన చింతం వంశీ, కొత్తవాడకు చెందిన ముజీమ్, కేయూ క్రాస్‌రోడ్డుకు చెందిన అంబి తేజ జాయిన్ ఆర్డర్లను తహసీల్దార్ ఎండీ ఇక్బాల్‌కు అందజేశారు. అలాగే, ఆటోనగర్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలక గృహంలో కూడా టీఎస్‌పీఎస్‌సీలో ఎంపికైన రాయపర్తి మండలం సన్నూరుకు చెందిన వెంకన్న సూపర్‌వైజర్‌గా విధుల్లో చేరినట్లు హోం సూపరింటెండెంట్ శ్రీదేవి తెలిపారు.

'మహేశ్వరం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు'

నర్సంపేట, డిసెంబర్ 24: మండలంలోని మహేశ్వరం గ్రామాన్ని నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని గ్రామ పెద్దలు మచ్చిక రాజుగౌడ్, చేరాల గోవర్ధన్, బూస రాజు, రామారావు డిమాండ్ చేశారు.